# పట్టుదల

తనను ధిక్కరించడమే! ఇంతవరకూ తాను అధికారం చలాయించడమే కాని ఎన్నడైనా ధిక్కారమంటూ ఎరుగునా!

సహించలేకపోయారు పాండురంగారావుగారు. ఆయన రిటైర్డు పోలీసు సూపరింటెండెంటు. ఆయన ఉద్యోగం చేసినంతకాలం ఆయన పేరు చెపితే ఆయన క్రిందివారూ, ప్రజలూకూడా గడగడలాడిపోయేవారు. ఆయనన్న మాటకు చిత్తం అనడమే తప్ప కాదనడానికి ఎవరికీ దమ్ములుండేవి కావు. ఆఖరికి ఆయన ఎదుట సందేహం వెలిబుచ్చడానికి కూడా అవకాశముండేది కాదు. అటువంటిది ఈనాడు తన కొడుకే తనను ధిక్కరిస్తే ఎలా సహించగలడు? ఇంట్లోనుంచి వెంటనే పొమ్మన్నాడు. కొడుకూ తక్కువవాడు కాడు. పోతానన్నాడు. పోయాడు.

కొడుకలా వెళ్లిపోవడం చూసి ఆయన కొంతసేపు నిశ్చేష్టులైపోయారు. ఎంత నిర్లక్ష్యం! ఎంత తృణీకారం! మరొకడైఉంటే ఏమి చేసిఉండేవారో! కాని ఆ పరిస్థితిలో చేయగలిగింది ఏమీ లేక, వ్యర్థకోపాన్ని అణచుకోలేక పళ్లు పటపట కొరుకుతున్నారు. ఒక మూల అయ్యో కొడుకే అన్న బాధ రగులసాగింది. కాని తానంటే ఏమీ లెక్కలేనట్లు అంతధీమాగా వెళ్లిపోయినందుకు కోపంతో ఏమైనా సరే మళ్ళీ అతనే వచ్చి బ్రతిమాలుకునేవరకూ అతని మొగం చూడకూడదన్న విపరీతమైన పట్టుదలా ఆయనలో పెరిగింది.

కోదండరావు అలా చేస్తాడని ఆయన ఎన్నడూ కలలోనైనా ఊహించలేదు. ఆయనకు కోదండరావు ఒక్కడే కొడుకు. అదైనా తమకు అసలు సంతానం కలుగుతుందా కలగదా అన్న వ్యధతో పీడింపబడగా, బడగా చివరికి నడివయస్సులో పుట్టినవాడు. కొడుకు పదోఏటే భార్య చనిపోయింది. అయినా ఆయన మళ్లీ పెళ్లి చేసుకోలేదు. కొడుకు సంరక్షణభారం తనేపూర్తిగా వహించారు. కొడుకు నెంతో ప్రేమతో, శ్రద్ధతో పెంచారు. అతను అప్పటికప్పుడు కొండమీది కోతిని తెమ్మన్నా తెప్పించి యిచ్చేవారు. అతను కాలు క్రింద పెట్టనక్కరలేకుండా నౌకర్లను ఏర్పాటుచేశారు. తనతోబాటు కాంపులకుతీసుకుపోయేవారు.. ఆయనకు వేట అంటే మహా సరదా. కొడుకుకు చిన్నతనంలోనే తుపాకిపట్టడం నేర్పి తనతోబాటు వేటకుకూడాతీసుకువెళ్లేవారు. కోదండరావుకుకూడా తండ్రిఅంటే ఎంతో ప్రేమా, గౌరవమూను. అతనుకూడా తండ్రిలాగే పొడగరి, రూపసి, బలిష్ఠకాయుడు. చురుకైనవాడుకూడా. చదువులో చకచకా పైకి వచ్చివేస్తున్నాడు. ఆ ఊరికాలేజీలో ఆవిడే బి.ఏ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. పాండురంగారావుగారు కొడుకు తెలివి

**వా. స. మూర్తి**

తేటలకు పొంగిపోతూ ఇంకా పెద్దచదువులు చదివించి ఏదో పెద్ద గవర్నమెంటు ఉద్యోగంలో ప్రవేశపెట్టడానికి ఉబలాటపడసాగారు. ఆయనా పెద్ద గవర్నమెంటు ఉద్యోగం చేసినవాడేకదా. పెద్దపెద్దవారితో మంచి పరిచయంఉంది. ఇక ఆయన అనుకున్నది నెరవేరడంలో ఆటంకమేముంది!

పాండురంగారావుగారికొక ప్రాణస్నేహితుడున్నాడు. ఆయనపేరు రామమూర్తిగారు. ఆయనకుకూడా వేట అంటే మహాసరదా. చదరంగంకూడా బాగా ఆడుతాడు. ఆయనకు ఒక్కతే కూతురు ఉంది. పేరు సుజాత. ఆమె అందమైనదీ, తెలివైనదీ. ఆవిడే ఇంటర్మీడియేట్ కూడా పాసయింది. టెన్నిస్ ఆడుతుంది. సైకిలు తొక్కుతుంది. నాట్యం చేస్తుంది - ఒకటేమిటి! ఆమె చలాకీతనం చూసి పాండురంగారావుగారెంతో ముచ్చటపడేవారు ఇద్దరూ ప్రాణస్నేహితులు కాబట్టి, ఇద్దరూ సమాన హోదాలోవారే కాబట్టీ, ఇటు పిల్లకీ పిల్లవాడికీ అన్నివిధాలా ఈడూ జోడూ కుదురుతుంది కాబట్టీ తమలో తాము వియ్యం పొందితే బాగుంటుందనుకున్నాడు. చాలా కాలంనుంచే వారీవిధంగా అనుకుంటూ వచ్చారు. చివరికి నిశ్చయానికి వచ్చారు - ఆరుడే వివాహం చేసివేయడానికి. ఈ నిర్ణయంసందర్భంలో తమ పిల్లలను సంప్రతించవలసినఅవసరమే వారికి కనిపించలేదు. తమ స్నేహాన్ని ఈవిధంగా దృఢతరం చేసుకుంటున్నందుకు ఆనందం పట్టలేక ఒకరినొకరు కౌగలించుకున్నారు. పెళ్ళికి ఏర్పాట్లు చేయసాగారు.

## 2

పెళ్లిమాట ఖాయం చేసుకున్న తరువాత పాండురంగా రావుగారు ఎంతో సంతోషంతో ఈవార్త కొడుకుకు చెప్పారు. కాని కొడుకు మొగంలో ఉత్సాహమేమీ కానరాలేదు. అతను మౌనంగా ఊరుకున్నాడు. తన ఆనందంలో పాండురంగారావుగారిది కనిపెట్టలేదు. కాని ఎంతసేపటికీ కొడుకు మారుమాటాడకపోయేసరికి తన వాక్ప్రవాహం ఆపి కొడుకు మొగంలోకి చూశారు. ఆశ్చర్యంతో స్తంభించిపోయారు. "ఏం, అలా ఉన్నావేం" అని అడిగారు తేరుకున్నాక.

"ఏంలేదు. నేనీ పెళ్లి చేసుకోనన్నాడు కోదండరావు.

మళ్లీ కొంచెంసేపు నిశ్చేష్టులైపోయారు పాండురంగారావుగారు.

"ఏమిటీ! అసలే పెళ్ళిచేసుకోవా ?"

"చేసుకుంటాను కాని ఈ సంబంధం కాదు."

పాండురంగా రావుగారికి అర్థంకావడం లేదు. అప్పుడే కోపం పొంగుకు వస్తోంది.

"ఎందుకు చేసుకోవు?"

కోదండరావు మాట్లాడలేదు.

"నీకు మతేమన్నా పోయిందా! ఇంత కన్న మంచి సంబంధం ప్రపంచమంతా వేతెట్టి వెతికినా దొరుకుతుందా? అంత చక్కనిదీ, అంత తెలివైనదీ, అంత చలాకీనదీ మరొకతె ఉంటుందా. పైగా నా ప్రాణస్నేహితుడి కూతురు సుజాతను చేసుకోవూ!"

"సుజాత చాలా అందమైనదే, తెలివైనదే. కానిఆమెను నేను పెళ్లిచేసుకోలేను."

పాండురంగారావుగారు కోపం ఆపుకోలేకపోతున్నారు. అయినా అతికష్టంమీద అణచుకొంటూనే అడిగారు." మరెవరినీ చేసుకుంటావు?"

"...................."

"నీ మనస్సు మరి ఎవరిమీదేనా ఉందా?"

"ఊఁ——"

"ఎవరు?"

"నా క్లాస్ మేట్ రామారావు చెల్లెలు విమల."



స్నానఘట్టం

ఫొటో: కె. నాగలింగేశ్వరరావు (చాటపర్రు)

# ★ పట్టుదల ★

"ఆఁ!! — నీవెవరి కొడుకువో మరచిపోయావా? కాలేజీ జీతానికికూడా ఇతరుల మీద ఆధారపడవలసివచ్చే అటువంటి వాళ్లతోనా మనకు సంబంధం?— నీ వామెను చేసుకోవడానికి వీలులేదు."

కోదండరావు మౌనంగాఉండిపోయాడు.

"ఏం, మాట్లాడవేం. నీవా సంబంధం చేసుకోడానికి ఎంతమాత్రమూ వీలులేదు. నీవు చేసుకుంటే సుజాతనే చేసుకోవాలి. ఏమంటావు?"

"చేసు-కో-ను" అన్నాడు కోదండరావు మెల్లగా.

అగ్నిపర్వతం బ్రద్దలైంది. "చేసుకోకపోతే వెంటనే ఇంట్లోనుంచి పో" అని రంకెపెట్టారు పాండురంగా రావుగారు.

"అయితే వెళ్లిపోతా"నన్నాడు కోదండరావు. అలాగే వెళ్లిపోయాడు.

అంతే, అప్పటినుంచీ తండ్రీ కొడుకూ ఒకరి మొగాలొకరు చూసుకోలేదు.


## 3

కొడుకు చర్యనుగురించి ఆలోచించిన కొలదీ పాండురంగారావుగారికి అసహ్యం ఎక్కువ కాసాగింది. పోతే పోయాడనుకున్నారు. తండ్రిమాట విననికొడుకుంటే నేం పోతేనేం! ఆయనస్నేహితుడు రామమూర్తి గారు తన కూతురికి వేరొక సంబంధం నిశ్చయం చేశారు. పాండురంగారావుగారు పెళ్లికి వెళ్లారు. ఆ పెళ్ళిలో సుజాత తనకు కోడలుకాకపోయిందే అన్న బాధ కలిగింది ఆయనకు. అయినా ఆమెనే కొడుకూ కూతురుగా ఎంచుకొని ఆమెకనేక బహుమతులిచ్చారు. స్నేహితుడింట్లోనే ఆరుమాసాలున్నారు. అక్కడనుంచి తన ఊరుకు రావడానికి ఆయన ఇష్టపడలేదు. కొడుకుకు తన లెక్క లేకపోతే తనకూ కొడుకు లెక్క లేదన్నట్లు దేశాటనంమీద బయలుదేరారు అక్కడకొన్నాళ్ళూ, ఇక్కడకొన్నాళ్లూ ఉంటూ, దేశం అంతటా తిరిగి, తిరిగి చివరికి ఆయన ఆరోగ్యం అంతగా బాగుండకపోయేసరికి నాలుగేళ్లకు తిరిగి తనఊరు చేరాడు.

తిరిగి వచ్చినతరువాత కూడా ఎన్నడూ ఎవరిదగ్గరా కొడుకు మాట ఎత్తలేదు. కొడుకునుగురించి విచారించడానికే ప్రయత్నించలేదు స్నేహితులందరినీ ఇంటికిపిలచి పేకాటతో చదరంగంతో, మిగిలిన సమయంలో పుస్తకాలతో సరదాగానే కాలక్షేపం చేయసాగారు.

## 4

కోదండరావు విమలనే పెళ్లిచేసుకున్నాడు. ఇక పైకి చదవడానికి అవకాశం లేకపోగా వెంటనే కూడు గుడ్డలకోసం తాపత్రయపడవలసి వచ్చింది. ఉద్యోగంకోసం ప్రయత్నం చేశాడు. ఊళ్లోవారెవరూ తండ్రికీ కొడుకుకీ వచ్చిన పేచీ తెలుసుకొని, అతనికి ఉద్యోగమీయడానికి సాహసించలేకపోయారు. ఆఊళ్ళో లాభంలేదని మద్రాసువెళ్ళి ప్రయత్నం చేశాడు. తండ్రిపేరు ఉపయోగించుకుంటే అతనికి వెంటనే ఎక్కడో అక్కడ పని లభించేది. కాని అతనికి ఆవిధంగా చేయడం తల తీసినట్లుగా కనిపించడంవల్ల అతనికృషి విఫలమై తిరిగి తనఊరేవచ్చి ఎలాగోఅలాగ తంటాలు



ఇన్యా లేక్ రంగూన్

ఫోటో: బి. రంగయ్య (రంగూన్)

పడి నాలుగైదు ప్రైవేట్లు సంపాదించి వాటితోటే కాలక్షేపం చేయవలసి వచ్చింది.

కాని ఆ ప్రైవేట్లవల్ల వచ్చేదానిమీద జీవితం గడపడం చాలాకష్టమైంది అప్పులు పెరగసాగాయి. ఇరుకు అద్దె కొంపలో ఉండవలసి వచ్చింది. ఆ పరిస్థితులలో, దారిద్ర్యప్రభావంవల్ల కోదండరావుకు విసుగూ, చిరాకూ ఎక్కువై ఎవరికోసం తానింత త్యాగంచేశాడో ఆమెమీదే కస్సుబుస్సుమంటున్నాడు. విమలకూడా అంతే చిరాకుతో జవాబిచ్చేది అప్పుడు వాళ్ళ వ్యవహారంచూస్తే వాళ్లు ప్రేమించి పెళ్ళిచేసుకున్నారని ఎవరూ నమ్మలేరు. వాళ్ళకొకకొడుకుకూడా కలిగాడు. వాడప్పుడే నాలుగేళ్లవాడయ్యాడు. విమల మామగారు మొదట్లో ఒప్పుకోకపోయినా, తరువాత కొన్నాళ్ళకైనా మనసు మార్చుకొని తమను చేరదీస్తారేమోనని ఆశించింది. కాని ఆమె ఆశ నిరాశ అయింది మామగారు నాలుగేళ్ళ వరకూ ఆఊరు తిరిగే రాలేదు. వచ్చిన తరువాతకూడా తమమాటే స్మరించకుండా స్వేచ్ఛగా కాలక్షేపం చేస్తున్నారు. ఇటుపోనీ భర్తేనా తండ్రిదగ్గరకుపోయి ఆయనను బ్రతిమాలి మనస్సు మార్చుకునేటట్లు చేస్తాడేమోనంటే అతను ఎన్నడూ తండ్రిమాట స్మరించడం లేదు. ఇతరులనీ స్మరించనీయడం లేదు. ఇక తమకీ బ్రతుకే తప్పదని నిశ్చయం చేసుకుంది. ఆమె తననే నిందించుకుంది. తనవల్లనే తండ్రీకొడుకులమధ్య ఈవిరోధం వచ్చింది. తనవల్లే కోదండరావు ఇంతటి కష్టాలు పడవలసివస్తోంది తన అడ్డు లేకపోయినట్లయితే అతడీపాటికి ఏ కలెక్టరు కూతురునో పెళ్లాడి, ఏ పెద్ద చదువో చదివి, ఏదో పెద్ద గవర్నమెంటు ఉద్యోగంలో ఉండేవాడు. తనకోసం అతనెంత త్యాగం చేశాడు! ఆమె హృదయంలో భర్తమీద విపరీతమైన ప్రేమ పొంగుకువచ్చేది. అతనిపట్ల తానోర్పుతో వ్యవహరించక అతని చిరాకుకు తగ్గ చిరాకుతోనే వ్యవహరిస్తున్నందుకు మిక్కిలి బాధపడేది. తన పరిస్థితులే తన్నిట్లా వివశంచేస్తున్నాయి. ఇంటి పరిస్థితులు అంతకంతకు చెడిపోతున్నాయి. కోదండరావు సంపాదన ఏనెలకానెల పాత అప్పులు తీర్చడంతోనే సరిపోతోంది. ఎప్పటికప్పుడు కొత్తబాకీలు పెరిగిపోతున్నాయి. ఇరుగుపొరుగులు చేబదుళ్ళు ఈయడంకూడా మానివేశారు. అన్నిటికీ కటకట పడసాగారు. కోదండరావు ఆరోగ్యంకూడా చెడిపోయింది. అతను దగ్గుతున్నాడు. ఆ దగ్గుచూసి విమల హడలిపోసాగింది. ఆఖరికి ఆమె తెగించింది.

## 5

ఒకరోజు మామగారికొక చీటీరాసి తన నాలుగేళ్ళ కుర్రవాడిని తీసుకొని బయలుదేరి, మామగారి యిల్లు కనపడేవరకూ వెళ్లి, అక్కడనుంచి కొడుకుకా ఇల్లుచూపి, అక్కడకు వెళ్ళి లోపల ముసలాయనకా చీటి ఇచ్చిరమ్మని కుర్రవాడిని పంపింది.

కుర్రవాడు చీటీ తీసుకొని వెళ్ళాడు. లోపల నౌకర్లకు తెలుసు ఆ కుర్రవాడు ఫలానా అని. అందువల్ల వాడక్కడకు రావడంచూసి ఆశ్చర్యంతో అలాగే నిల్చొనిపోయారు. వాడు వచ్చీరాని మాటలతో "పాండులంగాలావుగా లున్నాలా" అని అడిగాడు. "ఉన్నారు బాబూ, ఏంపనుంది బాబూ" అని అడిగారు నౌకర్లు. కుర్రవాడు మాటలాడకుండా లోపలికి నడచివెళ్ళాడు. పాండురంగారావు పడకకుర్చీలో కూర్చొని పేపరు చదువుకుంటున్నారు. పేపరు అడ్డుగా ఉండడంవల్ల వాడి రాక గమనించలేదు. ఎంతసేపటికీ ఆయన పేపరు చదవడం పూర్తికాకపోయేసరికి కుర్రవాడు ఆయన పక్కకు వచ్చి

నిలబడ్డాడు. ఆయన ఉలిక్కిపడి వాడికేసి చూశారు. వాడు మౌనంగా ఆ చీటీ ఆయన కందిచ్చాడు. ఆయన ఆశ్చర్యంతో చీటీ తీసుకొని చదివారు. కుర్రవాడికేసి చూశారు. "నీకేనన్నమాట ఆ విమల కొడుకు!" అనుకున్నారు. ఇంత గ్రంథానికీ ఆమే కదా కారణం. అటువంటిది ఈ విధంగా రాస్తుందా? ఎంత సాహసం! ఎంత నిర్లజ్జ! ఈవిధంగా తనను మెల్లగా మంచి చేసికోవడానికిదొక ఎత్తు! ఆయనకు మళ్ళా ద్వేషం పొంగుకు వచ్చింది. చీటీ నలిపి పడవేసి ఒక నౌకరుతో "ఈ కుర్రవాడితో వెళ్లిపొమ్మని చెప్పు"మన్నారు. నౌకరు చెప్పేలోగానే కుర్రవాడు పరిస్థితి గ్రహించాడు కాబోలు ఏమీ మాట్లాడకుండా తల వంచుకొని మెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

వాడు వెళ్లిన రెండు నిమిషాలకి ఆయన హఠాత్తుగా లేచి వరండాలోకి వెళ్లి వీధిలో పోతున్న ఆ పిల్లవాడికేసి చూశారు. ఆ నాలుగేళ్ళ బుడతడు అలాగే మెల్లగా అడుగులు వేసుకుంటూ, బస్సూ అవీ జాగ్రత్తగా తప్పించుకుంటూ పోతున్నాడు. ఉన్నట్టుండి ఆయన ఒక నౌకరిని వెళ్లి ఆ కుర్రవాడిని వెనక్కి పిలుచుకురమ్మన్నారు. తనను ధిక్కరించినందుకు ఎటువంటి గతి పట్టిందో కొడుకుకి ఇప్పుడు బాగా తెలియవస్తుంది. అతను ఎలాగైనా తనను క్షమాపణ కోరుకోవలసిన పరిస్థితి వస్తుంది. తన దగ్గరకు రావడానికి మొగం చెల్లక కొడుకే ఈవిధంగా చేసిఉంటాడనుకున్నాడాయన. ఆయన కిప్పుడదొక విధమైన తృప్తి కలిగింది. నౌకరు ఆ కుర్రవాడిని తీసుకు వచ్చాడు. పాండురంగారావుగారు పావలా రూపాయ లాకుర్రవాడి చేతిలో పెట్టి జాగ్రత్తకోసం నౌకరును కూడా వెళ్లిరమ్మన్నారు. ఒక క్షణం ఆ బుడతడి మొగంలోకి చూశారు. ఆ రూపాయలు చూసేసరికి వాడి చిన్ని మొగంలో సంతోషం తొణికిసలాడింది. మరొక క్షణం చూశారు. వాడచ్చు తన పోలికే. ఆయన హృదయంలో ఏదో మ్రోగింది. ఆయనకు మరి కొంతసేపు వాడి మొగం చూడాలనీ, వాడిని పలకరించాలనీ అనిపించింది కాని వాడు నౌకరుతోబాటు వెళ్ళిపోయాడు.

## 6

ఇప్పుడు ఆయన ఆలోచనలన్నీ తన కొడుకుమీదా, ఆ బుడతడు 'తన మనుమడి' మీదా పోసాగాయి. ఇన్నాళ్ళూ తన కొడుకు తన దగ్గరనుంచి వెళ్ళిపోయిన తరువాత ఎలా గడుపుకొంటున్నాడో ఆలోచించలేదు. కాని ఇప్పుడు అతను జీవితం ఎలా గడుపుతున్నాడో, ఏ ఇబ్బందులు పడుతున్నాడో అన్న ఆలోచనలు కలిగాయి ఆయనకు. తన దగ్గరకు కబురంపించవలసివచ్చిందంటే వాళ్లు నిజంగా డబ్బుకోసం ఎంత కటకటపడుతున్నారో! వేళకు సరిగా తిండి తింటున్నారో లేదో! కట్టుకుందుకు గుడ్డలు ఉన్నాయో లేవో? కొడుకు ఆరోగ్యం బాగా ఉందో లేదో? ఈ ఆలోచనలు కలిగేసరికి ఆయన హృదయం ఎన్నడూలేని ఆదుర్దాతో దడదడ కొట్టుకోసాగింది. ఆ బుడతడి మొగం జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా ఆయన గుండె పొంగిపడుతోంది. ఆయన ఈ ఆలోచనలు తప్పించుకోవడానికి ప్రయత్నించారు కాని ఆయన హృదయమే ఆయనకు లొంగక పోతే ఏం చేయగలరు? పోనీ కొడుకును గురించి ఎవరిద్వారానైనా కనుక్కుందామంటే - తను లొంగిపోయినట్లు కనబడదమే!

ఆయనకు సాయంత్రం వేళ ఊళ్లో ఒకటి, రెండు మైళ్లు షికారు చేయడం అలవాటు. ఇప్పుడు నగరంలో అన్ని వీధులకు షికారు సాగించడం మొదలుపెట్టాడాయన. ఒక రోజున కొన్ని వీధులైతే, ఇంకొక రోజున మరికొన్ని వీధులు షికారు వెళ్లివస్తున్నాడు. చివరికి ఒకరోజున కొడుకు ఇల్లు కనుక్కోగలిగారు. అదే అయిఉంటుంది. ఎందుకంటే అప్పుడే ఆ చిన్న కుర్రవాడు వీధిలోకివచ్చి అక్కడ పిల్లలతో ఆడడం మొదలుపెట్టాడు. వాడివెనకే ఎవరో వీధిలోకి వచ్చి వాడికేసే చూస్తోంది. "ఆమే నన్నమాట!" ఆమె తనను చూస్తుందేమో నన్న కంగారుతో దూరంనుంచే త్వరగా ఇంకొక వీధిలోకి తప్పుకున్నారు.

మర్నాటినుంచి ఆయన అటే వస్తున్నారు కాని ఆ యింటిదగ్గరకు రాకుండా పక్కవీధిలోనుంచి ఆ యిల్లు కనబడేటట్లుగా చూస్తూ వెళ్తున్నారు. ఆ యిల్లు జాగ్రత్తగా చూశారు. బాగా నేలబారు ఇల్లు. కప్పుమీద పెంకులైనా సరిగా లేవు. గోడలకు సున్నంలేదు. వీధిలో మురికికాలువలు. ఆ యిళ్లలో ఎటువంటివారు ఉంటారో ఊహించడం సులభమే. అటువంటివారిలో తన కొడుకొకడా! ఆయన హృదయం ఆరాటంతో గిజగిజలాడుతూ అటువైపుకు లాగసాగింది కాని ప్రతిష్ఠ ఆయనను వెనుకకు నొక్కిపట్టిఉంచింది.

"బాగా ఏడుపు వచ్చేదాకా నవ్వేవా నువ్వు, ఎప్పుడైనా?"

"ఆ!"

"ఎప్పుడూ?"

"ఈవేళ పొద్దున్నే."

"ఏంజరిగిందేం?"

"ఏమీలేదు. మా నాన్నగారు పడక కుర్చీలో పడుకోబోతే, పట్టా పూడిపోయి, ఆయన దభేలున కింద పడిపోయారు. అదిచూసి నేను పక్కున నవ్వేశాను. నేను నవ్వటంచూసి మా నాన్నగారు లేచివచ్చి రెండు వేశారు. దాంతో ఏడ్చేశాను."

మళ్లీ కొన్నాళ్లకు ఆ కుర్రవాడు ఇంటికి వచ్చాడు, ఈసారి పాండురంగారావుగారు వాడిని దగ్గరకు పిలిచి తల నిమురుతూ పేరడిగారు. వాడు 'రాంబాబు' అని చెప్పాడు. పేరు ముద్దుగానే ఉంది కాని అది తన పేరు కానందుకు ఆయన మనస్సు చివుక్కుమంది. వాడిని రోజూ ఏం చేస్తావని అడిగారు. వాడు తానేం చేసేది, వాళ్ల అమ్మా, నాన్నా ఏంచేసేదీ అంతా వచ్చీరాని మాటలతో, ఆమాటలైనా సరిగా పలకలేక నగరుస్తూ, కళ్లు పెద్దవిచేస్తూ, కాలివేళ్లమీదలేస్తూ, తలతిప్పుతూ చెప్పుకుపోయాడు. ఆ మాటలు వింటూంటే వాడిని కౌగలించుకోకుండా ఉండలేకపోయారాయన. వాడికోసం బిస్కట్లూ, చాక్లెట్లూ తెప్పించి, తినిపించి, రోజూ వస్తూఉండమని చెప్పి, డబ్బిచ్చి నౌకరును వెంటపెట్టి పంపారు.

రాంబాబు అలాగే రోజూవచ్చి తాతగారిదగ్గర చాలాసేపు ఆడుకొని పోతున్నాడు. ఇప్పుడు తాతగారిదగ్గర వాడికి బాగా చనువైంది. 'తాతా' అనే పిలుస్తున్నాడు. ఎన్నో అర్థంలేని ప్రశ్నలు వేస్తున్నాడు. ఏదో గొడవ చెపుతున్నాడు. ఇల్లంతా స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. నౌకర్లమీద అధికారం చలాయిస్తున్నాడు. నౌకర్లు చేతులు కట్టుకుని వాడేమి చేయమంటే అది చేస్తున్నారు. గుర్రాలుగా వంగమంటే వంగుంటున్నారు. రాంబాబు ద్వారా పాండురంగారావుగారు అప్పు

డప్పుడు డబ్బు పంపిస్తూనే ఉన్నారు. ఆ డబ్బుతో విమల చిన్న చిన్న అప్పులు తీరుస్తూ జాగ్రత్తగా సర్దుకుంటోంది. కాని తనకొడుకు తాతగారి ఇంటికి పోవడం కాని, భార్య మామగారి దగ్గరనుంచి డబ్బు తెప్పించుకోవడం కాని కోదండరావు ఎరగడు. ఆఖరికి అతనికీ తెలిసిపోయింది.

## 7

ఒక రోజున రాంబాబు తాతగారి ఇంటి దగ్గరనుంచి తెచ్చుకున్న బొమ్మతో ఆడుకుంటూ ఉండగా కోదండరావు చూశాడు. "ఇది ఎక్కడిది?" అని అడిగాడు ఆశ్చర్యంతో. దాపరికం అంటూ ఎరగని ఆ బుడతడు "తాతయ్య ఇచ్చాడు" అని చెప్పాడు. "ఏ తాతయ్య?" అన్నాడు కోదండరావు మరీ ఆశ్చర్యపోతూ. రాంబాబు అంతా చెప్పివేశాడు. కోదండరావు ఒక క్షణం స్తబ్ధుడైపోయాడు. వెంటనే కోపం ముంచుకువచ్చింది. "వెధవా అక్కడికి నిన్నెవరు వెళ్ళమన్నారు" అంటూ వాడి వీపుమీద గట్టిగా నాలుగు వాయించాడు. "అమ్మ పంపించింది" అంటూ కుర్రవాడు ఏడుపు మొదలుపెట్టాడు. కోదండరావు వెంటనే భార్యను కేకవేసి "నీవేనా ఈపని చేసింది" అని అడిగాడు. "ఏపని" అంది ఆమె. "వీడిని అక్కడికి పంపించింది నీవేనా?" అవునంది ఆమె (ఆమె డబ్బు తెప్పించుకున్న సంగతి ఇంకా అతనికి తెలియలేదు.) అతను వెంటనే మండిపడుతూ, "నీకేమైనా అభిమానం ఉందా. ఎందుకోసం నేనీ కష్టాలుపడేది. నీలా అభిమానం చంపుకుంటే ఈ కష్టాలు పడవలసి వచ్చునా. నీకభిమానం లేకపోతే నాకుంది ఇకనుంచి వీడిని అక్కడికి పంపావంటే నామీదఒట్టే" అన్నాడు. రాంబాబు చెవి పట్టుకొని గుంజుతూ "ఒరే వెధవా నువ్వు మళ్లీ అటు కాలు పెట్టావా చెవులుపట్టుకొని గిరగిర తిప్పి అవతల గిరవాటేస్తాను" అన్నాడు. ఆ కోపం చూసి భార్య కూడా ఏమీ మాట్లాడలేకపోయింది. రాంబాబు కూడా అప్పటినుంచి తాతగారింటికి పోవడం మానివేశాడు.

## 8

పాండురంగారావుగారు సాయంత్రం మనుమడికోసం ఎదురుచూశారు, వాడు రాలేదు. మర్నాడూ రాలేదు. నాలుగు రోజులైనా రాలేదు. ఒకవేళ కుర్రవాడికి ఏ జ్వరమైనా వచ్చిందేమో! ఆయన హృదయం ఆదుర్దాతో కొట్టుకోసాగింది. మనస్సు పరిపరివిధాల పోసాగింది. ఆదుర్దా ఆపుకోలేకపోయారు. నౌకరును పంపించి తాను పంపించినట్లు కాకుండా వాళ్ళింట్లో ఎలా ఉన్నది కనుక్కొని రమ్మన్నారు. వాడు వెళ్ళివచ్చాడు. ఇంట్లో అంతా కులాసాగానే వున్నారనీ, కుర్రవాడు చక్కగా ఆడుకుంటున్నాడనీ చెప్పాడు. ఈ వార్తకు ఆయనకు అంతులేని ఆశ్చర్యం కలిగింది. 'మరి రాంబాబు రావడం ఎందుకు మానివేశాడు? ఒక్కొక్క కారణమే ఊహించసాగారు. కాని ఏదీ సరియైనదిగా తోచలేదు. చివరకు తోచింది కొడుకు రానీయకుండా చేసిఉంటాడని. అదే అయి ఉంటుంది. సందేహం లేదు. ఆయనకు మళ్ళీ రోషం పుట్టుకువచ్చింది. కొడుకు



# ★ పట్టుదల ★

కేనా అంత పట్టుదల, తనకు మాత్రం లేదా? కాని ఇప్పుడాయనకు ఆ బుడతడిని చూడకుండా ఉండడమనేది దుర్భరమైపోయింది. జీవిత సంధ్యలో ఉన్న ఆయన హృదయం ఇంకొకరి ప్రేమకోసం పరితపించసాగింది. జీతపురాళ్లకోసం నౌకర్లు చాకిరీ చేస్తారు కాని తాను మూలిగినా, చచ్చినా కన్నీరు విడచేవా రెవరూ ఉండరనిపించింది. ఇంతవరకూ ఎన్నడూ ఆయనకిటువంటి ఆలోచనలు కలుగలేదు. ఇప్పుడు తానేకాకియైపోయినట్లు బాధపడసాగారు. అర్థం లేని భయాలెన్నో ఆయన హృదయాన్ని ఆవరించివేశాయి.

ఆయన ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. నౌకర్లు చాకిరీ చేస్తూనే ఉన్నారు. డాక్టర్లు వచ్చి చికిత్స చేస్తూనే ఉన్నారు. నర్సులు ఉపచారం చేస్తూనే ఉన్నారు. అయినా ఆయన హృదయబాధ ఉపశమించడం లేదు నా అనే వారొకరూ దగ్గర లేరే అన్న బెంగతో ఆయన పరిస్థితి ఉన్నదానికంటె కూడా అధ్వాన్నంగా ఉంది. క్రమక్రమంగా క్షీణించిపోతున్నారు. డాక్టర్లు కూడా ఆశ వదులుకున్నారు. ఆయన నిశ్చయించుకున్నారు తన తుది ఘడియలు సమీపించాయని. ఒక్కసారిగా ఆయన కళ్ళనుండి కన్నీటిధార పొంగి పొరలింది. పోలీసు సూపరింటెండెంట్ పదవి నిర్వహించినవాడు, ప్రజలను హడలెత్తించినవాడు, ఆయన ఆ పెద్ద వయస్సులో చిన్నపిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడ్వసాగారు. తన భార్యా, తల్లీ, తండ్రీ జ్ఞాపకం వచ్చారు. వారి చావులు జ్ఞాపకంవచ్చాయి. తన కొడుకు పుట్టడం, వాడిని తాను పెంచడం, వాడు చిన్నతనంలో ఏమేమి చేసిందీ అన్నీ వరుసగా జ్ఞాపకం రాసాగాయి. అవి తలచుకొన్నకొలదీ ఆయన ఏడ్పుకు కట్టు లేకపోయింది. యజమాని ఏడుపు చూసి నౌకర్లకేమీతోచక, నివెర్వపోయి నిలబడిపోయారు. ఆ దుఃఖపుపొంగు కొంతసేపటికి కొద్దిగ తగ్గిన తరువాత ఆయన ఇక ఆగలేక ఒక నౌకరును పిలచి కొడుకు ఇంటికి వెళ్ళి కోడలితో తన పరిస్థితి ఏమీ బాగుండలేదని చెప్పిరమ్మన్నాడు.

వాడు రెక్కలు కట్టుకున్నట్టు వెళ్ళి కోదండరావుభార్యతో చెప్పాడు. ఈ వార్త వినగానే ఆమె కంగారుగా పిల్లవాడిని తీసుకొని బయలుదేరింది. అప్పుడే కోదండరావు తిరిగివచ్చాడు. "ఎక్కడికి?" అన్నాడు. ఆమె చెప్పలేదు. "అక్కడికేనా?" అన్నాడు తీక్ష్ణంగా. "అవును, అక్కడికే ఆయనకు చాలా జబ్బుగా ఉందట" అంది ఆమె. "వెళ్ళడానికి వీల్లేదు" అన్నాడు కోదండరావు మొండిగా. "మీ తండ్రిగారి మాట మీరు విన్నారు గనుక నా నేను మీ మాట వినడానికి" అని ఆమె చరచరా వెళ్ళిపోయింది.

ఆమెను చూసేసరికి పాండురంగారావుగారి ఏడ్పు మళ్ళీ పెల్లుబికింది ఆ దృశ్యం చూడగా అమె గుండె కరిగిపోయి ఆయన పక్కదగ్గరకు చేరి మెల్లగా ఆయన కాళ్లు రాయసాగింది కుర్రవాడు తాతగారిదగ్గరకు చేరాడు. వాడికేమీఅర్థం కావడం లేదు. తాతగారిఏడుపు చూసి వాడూ ఏడవసాగాడు. ఆయన వాడిని తన దుర్బలమైన చేతితో మెల్లగా దగ్గరకు లాగుకొని, గుండెలకదుముకొని, ముద్దుపెట్టుకొంటూ, కన్నీటితో వాడి తల తడిపివేశారు. కొడుకు రాలేదేనన్న లోటు కనిపించినా తనవాళ్లనేవారున్నారు కదా అనే సంతృప్తి కలిగింది ఆయనకు. హృదయంమీద బరువు తొలగినట్లైంది. శరీరం తేలిపోతున్నట్లుగా అనిపించింది. వెంటనే ఆయనప్లీడరును పిలచి తాను రాయించిన వీలునామా చదవమన్నారు. ప్లీడరు చదివాడు. ఆయన ఆస్తిఅంతా మనుమడి పేర రాయబడింది. ఈ ఆస్తికంతా ట్రస్టీగా విమలనే పేరొక్కన్నా రాయన. — ఎవరివల్లనైతే తండ్రీ కొడుకులు విడిపోయారో ఆమెనే. ఆయన వీలునామామీద సంతకం చేశారు. డాక్టరుచేతా, ప్లీడరుచేతా ఆమెచేతా సాక్షిసంతకాలు చేయించారు. వీలునామా కుర్రవాడిచేతిలో పెట్టారు. తేలిపడ్డ గుండెతో మనుమడి తల నిమురుతూ పడుకున్నారు.

## 9

భార్య వెళ్లినతరువాత కోదండరావు మనస్సులో మథనపడసాగాడు. అతని కంతకు ముందే తెలిసింది తండ్రి ఆరోగ్యం చెడిపోయిందని. అయినా మొదట్లో ఉపేక్షా భావంతో ఈ విషయంగురించి ఆలోచించలేదు. కాని భార్య అలా వెళ్లడం చూసిన తరువాత అతనిఆలోచనలన్నీ తండ్రిమీదకే పోయాయి. తండ్రి పరిస్థితి ఎలా ఉందో? తండ్రి తనను చిన్నప్పటినుంచీ ఎలా పెంచిందీ, తల్లి లేని లోటు కనిపించకుండా ఎంతప్రేమతో తనను చూసిందీ అంతా స్మరణకు వచ్చింది. అటువంటి తండ్రి బాధపడుతూంటే తను లెక్కచేయకుండా ఊరుకోవడమా! తండ్రి ఒకసారి ఏదో తొందరపాటుగా వ్యవహరించినందుకు తానీవిధంగా ప్రతిక్రియ చేయాలా? తండ్రి నిజంగా అవసానదశకు వచ్చాడేమో! తండ్రిని తాను మరి చూడలేడేమో! అతను ఒక్కపరుగున తండ్రి యింటికి వచ్చాడు.

గుమ్మంలో అడుగు పెట్టాడు రక్తాన్ని కరుడుగట్టించే ఏడుపులు ఒక్కసారిగా లేచాయి అతను ఒక్క ఉరుకులో ప్రాణం లేని తండ్రి శరీరంమీద పడి ఇన్నేళ్ళ ఎడబాటుకు ప్రాయశ్చిత్తంగా గుండెలు పగిలిపోయేటట్లు ఏడవసాగాడు. ★

